
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3



శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 1 సెప్టెంబరు 2025

రామేశ్వరం వెళ్లినా శనేశ్వరం వదల్లేదన్న సామెతగా మారింది వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) రోడ్ల పనుల పరిస్థితి. వైసీపీ ప్రభుత్వం పోయి ఏడాది గడిచినా ఇంతవరకూ ఆ వర్కులకు పట్టిన గ్రహణం వీడలేదు. ఈ వర్కుల విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అసలు ఈ వర్కులు జరుగుతాయా? లేదా? అన్నది కూడా ప్రశ్నార్థకంగానే మారింది. మూడేళ్లు గడిచినా ఏఎంసీ వర్కులకు హెడ్ ఆఫ్ అకౌంట్ లేదు. ఇప్పటివరకూ చేసిన పనులకు బిల్లుల చెల్లింపు ఊసే కనిపించడం లేదు. జిల్లాలోని కీలక కనెక్టివిటీ రోడ్లన్నీ ఈ జాబితాలోనే ఉన్నాయి. వాటిని బాగు చేస్తారా? లేదా? అంటూ ఇటీవల జరిగిన జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశంలోనూ ఎమ్మెల్యేలంతా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. ఈ వర్కుల విషయంపై అధికారులు కూడా అనేక సార్లు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారు. అయినా ఎటువంటి స్పష్టత రాలేదు. దీంతో ఏఎంసీ జాబితాలో ఉన్న రోడ్లను మరో ఫండ్ కింద అయినా బాగు చేయాలా!? లేదా!? అన్న సందిగ్ధంలో పంచాయతీరాజ్ అధికారులు ఉన్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

ఏడాదైనా నిర్ణయమేది!?

- ఏఎంసీ వర్కులపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- కీలక రోడ్లన్నీ ఆ జాబితాలోనే!
- ఆ 171 వర్కులు ఉన్నట్టా.. లేనట్టా!?
- చేసిన 25 రహదారి పనులకూ బిల్లులేవీ?
- డీఆర్సీలోనూ ఇదే అంశంపై సుదీర్ఘ చర్చ



కలువాయి : దారుణంగా దెబ్బతిన్న గోపవరం రోడ్డు

ఏఎంసీ నిధులతో రోడ్లను బాగు చేస్తున్నామని నాడు గొప్పగా ప్రచారం చేసుకున్న వైసీపీ ప్రభుత్వం చివరకు చేతులెత్తేసింది. ఆ ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 222 రోడ్లను రూ.185.40 కోట్లతో అభివృద్ధి చేసేలా పీఆర్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. మొత్తం 591 కిలోమీటర్ల రోడ్లను 34 ప్యాకేజీలుగా విభజించి 2022, జూన్‌లో తొలిసారిగా టెండర్లు పిలిచా రు. మొదటి నుంచీ ఈ వర్కులకు నిధులపై స్పష్టత లేకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. 176 పనులకు మాత్రమే కాంట్రాక్టర్లు టెండర్లు వేయగా, మిగిలిన 46 పనులకు స్పందన లేదు. వీటిలో 51 పనులను మొదలు పెట్టగా 26 రోడ్డు పనులను పూర్తి చేశారు. మరో 25 పను లు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. మొత్తంగా 171 పనులు అసలు జరగలేదు. గతేడాది ఆర్థిక శాఖ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ప్రారంభం కాని పనులను రద్దు చేయాల్సి ఉంది. అయితే ఈ విషయంలో కూడా స్పష్టత లేదు. ఈ 171 రోడ్డు పనులు ఉన్నట్లా.. రద్దయినట్లా..? అన్నది కూడా స్పష్టంగా తెలియడం లేదు.

ప్రజలకు తప్పని అవస్థలు

ఉమ్మడి జిల్లాలో కీలకమైన రోడ్లను ఏఎంసీ నిధులతో అభివృద్ధి చేసేందుకు అనుమతించడంతో ఆ రోడ్లను వేరొక నిధులతో అభివృద్ధి చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్లను బాగు చేసేందుకు ఇప్పటికీ బడ్జెట్ కేటాయించలేదు. బ్యాంకుల నుంచి రుణం రాకపోగా, దీనిపై ప్రభుత్వం కూడా ఇంత వరకూ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటి వరకూ చేసిన పనులకు కూడా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో వారు కొత్తగా పనులు చేసేందుకు ముందుకు రావడంలేదు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గ్రామీణ కనెక్టివిటీ రోడ్లను బాగు చేయాలని 2022లో టెండర్లు పిలిచే నాటికే ఆ రోడ్లు దారుణంగా దెబ్బతిని ఉన్నాయి. ఈ మూడేళ్లలో ఇంకా గుంతలమయంగా మారాయి. కొత్తగా రోడ్లు వేసేది అటుంచితే కనీసం ప్యాచ్‌లు వేసే పరిస్థితి కూడా లేకుండా పోయింది. అసలు ప్రారంభం కాని 171 రోడ్డు పనుల విషయంలో త్వరగా ఏదో ఒక నిర్ణ యం తీసుకొని వాటిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ పరిశ్రమల వైపు అడుగులు

- ముందుకొచ్చిన ఇఫ్కో, అంబానీ, అదానీ సంస్థలు
- రూ.3291 కోట్ల పెట్టుబడి.. 44,285 మందికి ఉపాధి
- ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం

నెల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని వ్యాపారవేత్తలను ఒప్పిస్తుండడంతో ఫలితాలు వస్తున్నాయి. తాజాగా మూడు భారీ ప్రాజెక్టులు నెలకొల్పేందుకు మూడు సంస్థలు ముందువకు చ్చాయి. ఇఫ్కో కిసాన్ సెజ్, దీరూబాయ్ అంబానీ గ్రీన్‌టెక్ పార్కు, అదానీ విల్మర్ సంస్థలు జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. కృష్ణపట్నం సమీపంలో గతంలో పవర్ ప్లాంటు నిర్మాణం కోసం రిలయన్స్‌కు కేటాయించిన సుమారు 2500 ఎకరాల భూములు ఇప్పుడు వినియోగంలోకి రాబోతున్నాయి. ఈ భూముల్లో దీరూబాయ్ అంబానీ సంస్థ గ్రీన్‌టెక్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రూ.1,843 కోట్లతో ఇక్కడ పార్కును ఏర్పాటు చేసి, 19 వేలమందికి ఉపాధి కల్పించే లా ప్రతిపాదనలు అందజేసింది. అలానే కొడవలూరు మండలంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ భూములు కూడా రెండు దశాబ్దాల వివాదాల అనంతరం వినియోగంలోకి రానున్నాయి. ఈ భూములకు సంబంధించిన వివాదం ఇటీవల హైకోర్టులో పరిష్కారమైంది. దీంతో ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు మార్గం సుగమమైంది. ఈ క్రమంలో ఇఫ్కో కిసాన్ సెజ్ సంస్థ రూ.870 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రాజెక్టు ద్వారా 25 వేలమందికి ఉపాధి లభించనున్నదని ఆ సంస్థ పేర్కొంది. అలానే అదానీ విల్మర్ సంస్థ కూడా జిల్లాలో రూ.578 కోట్ల పెట్టుబడితో భారీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. వ్యవసాయ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమను ఏర్పా టు చేసేందుకుగానూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ పరిశ్రమ ద్వారా 285 మందికి ఉపాధి దొరుకుతుందని తన ప్రతిపాదనల్లో ప్రస్తావించింది. మొత్తంగా ఈ మూడు సంస్థలు రూ.3291 కోట్ల పెట్టుబడితో 44,285 మందికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర స్థాయి పరిశ్రమల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు.



నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులోని ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాజెక్టు కార్యాలయం

అందరిలోనూ దేశభక్తి, దైవభక్తి పెరగాలి

- పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- 10 అడుగుల వినాయక విగ్రహం ఆవిష్కరణ
- వైభవంగా గణేశ్ నిమజ్జనం

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : అందరిలోనూ దేశభక్తి, దైవభక్తి పెరగాలని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్‌లో నిర్వహించిన వినాయక నిమజ్జనానికి సతీమణితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ రానున్న తరాలకు తల్లిదండ్రులు దేశభక్తిని, దైవభక్తిని నేర్పించాలని కోరారు. గణేశ్ ఉత్సవాలను అందరూ జరుపుకోవాలని కోరారు. గణనాథుడ్ని పూజిస్తే అన్నీ విఘ్నాలు తొలగి, ప్రజలు సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు. జీవనదులను కాపాడుకుంటే పంటలు పండుతాయని, దేశం అభివృద్ధి చెందుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా, పొదుపుగా వాడుకోవాలన్నారు. త్వరలోనే భారత్ ప్రపంచంలో రెండువ ఆర్థికశక్తిగా ఎదుగుతుందని చెప్పారు. ఈ సభలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపమ్మ, గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు భయ్యా శ్రీనివాసులు తదితరులు ప్రసంగించారు.

వినాయక విగ్రహం ఆవిష్కరణ

స్వర్ణాల చెరువులో ఏర్పాటు చేసిన 10 అడుగుల వినాయక విగ్రహానికి ఎం. వెంకయ్యనాయుడు దంపతులు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దీపావెంకట్ దంపతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఆవిష్కరించారు. అనంతరం స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మృతిగా గణపతి విగ్రహానికి శోభాయాత్ర నిర్వహించి ఘాట్‌కి తీసుకువచ్చారు. వేదపండితులు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో అర్చకులు గంగాహారతి ఇచ్చారు. వెంకయ్యనాయుడు దంపతులతోపాటు వేలాదిమంది భక్తులు చూసి గంగా హారతిని తిలకించి తరలించారు. అనంతరం గణేశ్ నిమజ్జనం జరిగింది. మూలాపేటలోని గణేశ్‌ఘాట్‌ను విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా అలంకరించారు. భారీ క్రేన్‌తోపాటు నాలుగు క్రేన్‌లను కూడా గణేశ్ విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేశారు. మిరుమిట్లు గొలిపే బాణసంచా వేడుకలు కనువిందు చేశాయి. నెల్లూరు నగరం నలుమూలల నుంచి వేలాది గణపతులు నిమజ్జనానికి తరలివచ్చాయి. స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్‌తోపాటు రంగనాయకులపేట పెన్నాఘాట్‌లోనూ నిమజ్జనాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ కమిటీ నేతలు, బీజేపీ నాయకులు పీ.సురేంద్రరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేశ్‌రెడ్డి, పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాల చెరువు ఘాట్‌లో పది అడుగుల గణేశ్ విగ్రహన్ని ఆవిష్కరించిన వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి, నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు

నెల్లూరు : వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా గణేశ్ ఘాట్‌లో నిర్వహించిన గంగాహారతి





నెల్లూరు : స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మృతిగా గణపతి శోభాయాత్ర

పౌష్టికాహార లోపంతో మృత్యువాత

- జిల్లాలో ఎంతోమంది తల్లులు, చిన్నారుల మరణం
- పిల్లల ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరం
- ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం
- నేటి నుంచి జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరం. పోషకాహారం అందక జిల్లాలో ఎంతోమంది తల్లులతోపాటు చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు 62 మంది చిన్నారులు, 19 మంది తల్లులు మృతి చెందారంటే జిల్లాలో గర్భిణులు, చిన్నారుల పరిస్థితి ఎలా ఉందో తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు ఒకటి (నేటి) నుంచి 7వరకు జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా జిల్లాలో విస్తృతంగా వైద్య ఆరోగ్యశాఖ ప్రచారం నిర్వహించాల్సి ఉంది.

ప్రత్యేక చికిత్సలు చేస్తున్నా..

జిల్లాలోని 2,934 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరేళ్ల ఏళ్లలోపు 1,33,207 మంది చిన్నారులకు, 13,819 మంది గర్భిణులకు, 11,503 మంది బాలింతలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తున్నది. నెల్లూరు జీజీహెచ్‌లో 30 పడకలతో ప్రత్యేక పౌష్టికాహార కేంద్రమే ఉంది. అలాగే 50 పడకలతో ప్రత్యేక ఎస్ఎన్‌సీయూ ఏర్పాటు చేశారు. ఇక్కడ బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ప్రతి ఏటా జిల్లాలో 45 వేల ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులలోనే 12 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నారు. ఈ క్రమంలో పౌష్టికాహార లోపంతో ఎక్కువ మంది చిన్నారులు మృత్యువాత పడుతున్నారు.

36శాతం చిన్నారుల్లో ఎదుగుదల లోపం

పౌష్టికాహారలోపం కారణంగా 36శాతం మంది చిన్నారుల్లో ఎదుగుదల లోపిస్తున్నది. ప్రత్యేకంగా వీరికి వైద్య చికిత్సలు అందించాల్సి ఉంది. అలాగే బరువు తక్కువగా ఉన్న చిన్నారులు 32 శాతం మంది జిల్లాలో పుడుతున్నారు. సాధారణంగా 2.50 కిలోల బరువు ఉండాల్సిన చిన్నారులు పౌష్టికాహార లోపం వల్ల కిలో కంటే తక్కువ బరువుఉన్న చిన్నారులకు తల్లులు జన్మనిస్తున్నారు. 19 శాతం మంది బక్కచిక్కిన చిన్నారులు పుడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2.4 శాతం మంది ఊబకాయంతో పుడుతున్నారు. వీటన్నింటికి పౌష్టికాహా రం లోపమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు.



పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరి

చిన్నారుల్లో ఎక్కువశాతం మరణాలకు పౌష్టికాహారం లోపమే కారణం. తక్కువ బరువు ఉన్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక చికిత్స అందించాలి. లేందటే చిన్నారులు మృత్యువాత పడక తప్పదు. పప్పుధాన్యాలు, గింజధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, ఆకుకూరలు, కాలానికి అనుగుణంగా దొరికే పండ్లు, గుడ్లు, పాలు. పెరుగు తప్పనిసరిగా తీసుకోవాలి.

- డాక్టర్ సర్దార్ సుల్తానా, జీజీహెచ్ చిన్నపిల్లల విభాగం హెచ్‌వోడీ



గర్భిణులు ఆహారం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి. రక్తహీనతకు గురయి ప్రసవ సమయంలో మృత్యువాత పడకుండా చూసుకోవాలి. యుక్త వయసు నుంచే పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పురుటి పిల్లలకు తల్లుపాలు సమృద్ధిగా అందించేలా చర్యలు తీపుకోవాలి. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా అందించాలి.

- డాక్టర్ పల్లంరెడ్డి యశోధర, గైనకాలజీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

లోపాన్ని అధిక మించాలంటే...

తల్లులు, పిల్లల్లో పౌష్టికాహార లోపాల్ని అధికమించాలంటే తృణధాన్యాలు, గింజ ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, పెరుగు, ఇతర పాల ఉత్పత్తులు తీసుకోవాలి. అలాగే గుడ్లు, చికెన్ వంటివి తీసుకోవాలి. ఐరన్, జింక్, అయోడిన్ తదితర ఖనిజ లవణాలు, విటమిన్-ఏ, బీ, సీ తదితర సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉండే పదార్థాలు తప్పక తీసుకోవాలి.



పౌష్టికాహార లోపంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి

శ్రీధర్‌రెడ్డి వ్యవహారంలో దర్యాప్తు వేగవంతం

- ఇంటి పరిసరాల్లో సీసీ ఫుటేజ్‌ల పరిశీలన

నెల్లూరు(క్రైం), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని హత్య చేస్తే డబ్బే డబ్బు. అంటూ కొందరు రౌడీషీటర్లు మాట్లాడుకున్న వీడియోపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఇప్పటికే ఆ వీడియోలో ఉన్న వారందరినీ అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిని ఓ వైపు తమదైన శైలిలో విచారిస్తూనే, మరోవైపు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇంటి పరిసరాల్లోని సీసీ ఫుటేజ్‌లను పోలీసులు సేకరించినట్లు తెలిసింది. వీడియోలో మాట్లాడుతున్న వారు శ్రీధర్‌రెడ్డి నివాసం చుట్టుపక్కల ప్రాంతాల్లో కొంతకాలంగా రెక్కీ నిర్వహించారా...? ఆ ప్రాంతాల్లో వారు తిరుగుతున్నట్లు ఎవరైనా గమనించారా...? అని పరిశీలించడంతోపాటు, స్థానికులను విచారిస్తున్నట్లు సమాచారం.ఈ వ్యవహారంపై పోలీసులు అన్నీ కోణాల్లోనూ దర్యాప్తు ప్రారంభించారు.

సివిల్ వివాదాలే ఎక్కువ !

- 4 వారాల్లో పోలీస్ గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు 368
- సివిల్‌వి 214.. 2వ స్థానంలో మహిళా ఫిర్యాదులు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 31 (ఆం ధ్రజ్యోతి) : పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్, గ్రీవెన్స్) సివిల్ వివాదాల పరిష్కారం కోసం బాధితులు క్యూ కడుతున్నారు. భూమి, ఆస్తి, డబ్బులకు సంబంధించి, కోర్టులో జరుగుతున్న కేసులు, రెవెన్యూకు సంబంధించిన సివిల్ వివాదాలు పరిష్కరించాలంటూ ప్రతి సోమవారం నెల్లూరులోని ఎస్పీ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజలు తరలి వస్తున్నారు. గత నాలుగు వారాల గ్రీవెన్స్‌ను పరిశీలిస్తే అధిక సంఖ్యలో ఫిర్యాదులు సివిల్ వివాదాలపైనే ఉన్నాయి. రెండో స్థానంలో భర్త, అత్తింటి వారు వేధింపులు, భర్త చనిపోతే అత్తింటి వారు ఇబ్బందులకు గురి చేయడం, చెడువ్యసనాలకు బానిసలై భర్తలు వేధిస్తున్నారంటూ మహిళలు ఇచ్చే ఫిర్యాదులు ఉన్నాయి. ఇక మూడవ స్థానంలో పెట్టీ కేసులు, నాల్గవ స్థానంలో సైబర్, చీటింగ్ నేరాలు ఉన్నాయి. కనిపెంచిన బిడ్డలు వృద్ధాప్యంలో తిండి పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ వస్తున్న ఫిర్యాదులు ఐదో స్థానంలో ఉన్నాయి.

4 వారాల్లో గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులు

మొత్తం అర్జీలు	: 368
సివిల్ వివాదాలు	: 214
మహిళ ఫిర్యాదులు	: 67
పెట్టీ కేసులు	: 36
సైబర్, చీటింగ్	: 24
వృద్ధులు	: 15
బాడిలి అఫెన్స్	: 12



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్ (ఫైల్)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9909
వెండి కిలో ధర	రూ. 123700
వెండి ఒక గ్రాము	రూ.126.70

ఏసీ స్టేడియంలో ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు(విద్య), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కిలారి వెంకటస్వామి నాయుడు స్మారకార్థం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస కుమార్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ కృష్ణమూర్తిలు వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీ.సత్యనారాయణ, కార్యదర్శి సురేష్, మాజీ అధ్యక్షులు వీ.రంగారావు, బీ.శేషగిరిరావు, తిరుపతినాయుడు, నేతలు రమణయ్య, అనంతరామారావు తదితరులు పాల్గొన్నారు.

పడారుపల్లిలో గణేష్ లడ్డూ రూ.1.35 లక్షలు



లడ్డూను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

నెల్లూరురూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్‌లోని పడారుపల్లి శివాలయం వద్ద గణేష్ మండపంలో లడ్డూను వేలం వేయగా కాకుటూరు మస్తానయ్య రూ.1.35 లక్షలకు సొంతం చేసుకున్నారు. అనంతరం గణేష్ ఊరేగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. వావిలేటిపాడు సరస్వతీనగర్‌లో ప్రతీ ఏటా రూ.10 వేలకు మించి వేలం దాటని గణేష్ లడ్డూ ఈసారి రూ.40 వేల పలికింది. అనంతరం యువత కేరింతల నడుమ వినాయకుని ఊరేగింపు వేడుకలు చేపట్టారు.

ఘనంగా శ్రీకృష్ణ వినాయక నిమజ్జనోత్సవాలు

● నెల్లూరు(సాంస్కృతికం): క్రాంతినగర్ కొండా బాలరామిరెడ్డివీధిలోని శివకేశవుల దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ వినాయకుడి విగ్రహ నిమజ్జనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథులుగా నిరంజన్‌రెడ్డి, లాయర్ లోకనాథం, పారిశ్రామికవేత్త తాటిపర్తి బాలాజీ పాల్గొన్నారు. నిర్వాహకులుగా విజయ్, గోవింద్, వెంకటేష్, కుమార్, సురేంద్ర, సాయి, యంగమ్మ, దర్శిగుంట పెంచలయ్య పాల్గొన్నారు.

● **బాలాజీ నగర్‌లో అన్నదానం**

నగరంలోని 13వ డివిజన్ బాలాజీనగర్ లక్కీబోర్డు సెంటర్‌లో టీడీపీ నేత తానే మస్తాన్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులను అభినందించారు.

తెలుగుభాషా వికాసాన్ని పెంపొందించాలి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా వికాసాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను ఏ ట్రస్ట్ అధ్యక్షుడు అలహరి వెంకటేష్, తదితరులు కోరారు. ఆదివారం నెల్లూరుకు వచ్చిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో పేర్కొన్న పలు అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన జిల్లా నేతలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్‌ను, నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సంఘ నేతలు ఆదివారం విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నేతలు చైర్మన్‌తో బ్రాహ్మణ సంక్షేమం, సమస్యల గురించి చర్చించారు. గరుడ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు గుడ్లదొన వాసుదేవరావు, దద్దుకూరు రమేష్, రామాయణం మణికుమార్, ఉదయగిరి శేషాచార్యులు, గుడ్లూరు ఫణికుమార్ శర్మ, పేరేపి శ్రీనివాసశర్మ, జీవీ సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

గుర్రపుడెక్క ఇలా... నీరుపారేదెలా..?

ఎడగారు వ్యవసాయ సీజన్‌కు చివరి తడి నీరు ప్రస్తుతం పంటకాలువల్లో పారుతుంది. ఈ తడి పంటకు అత్యంత ముఖ్యం. అయితే జాఫర్‌సాహెబ్ కాలువ నుంచి అటు లేబూరు, ఇటు కోడూరు కాలువలకు సాగునీరు పారాలి. కానీ ఈ కాలువలో గుర్రపుడెక్క అల్లుకుని నీరు ముందుకు సాగని దుస్థితి ఏర్పడింది. అల్లీపురం వద్ద కాలువంతా గుర్రపుడెక్క అల్లుకోవడంతో రెగ్యులేటర్ వద్ద నీరు నెమ్మదిగా వెళుతుంది. దీనివల్ల చివర ఆయకట్టు రైతాంగానికి పూర్తి స్థాయిలో నీరందే వీలులేదన్న ఆందోళన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. వ్యవసాయ సీజన్ మొదలవగానే ఇరిగేషన్ అధికారులు ఇలాంటి సమస్య తలెత్తకుండా గుర్రపుడెక్క రాకుండా నిలువరించాల్సిన చర్యలేవి తీసుకోకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తినట్లు రైతులు వాపోతున్నారు.

- నెల్లూరురూరల్,(ఆంధ్రజ్యోతి)



గుర్రపుడెక్కతో నిండిపోయిన జాఫర్‌సాహెబ్ కాలువ

పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

● **ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి**

నెల్లూరు(విద్య), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వీఆర్ హైస్కూల్‌లో నిరుపేద విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, జాతీయ భద్రతా సలహా మండలి సభ్యుడు గుండ్రా సతీష్‌రెడ్డి అన్నారు. నగరంలోని వీఆర్ హైస్కూల్‌ను ఆదివారం రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌లతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా అత్యాధునిక వసతులతో వీఆర్ హైస్కూల్‌ను తీర్చిదిద్దడంతోపాటు మంత్రి నారాయణ పేద విద్యార్థులను దత్తత తీసుకుని ప్రోత్సహించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఇదే స్ఫూర్తితో మరికొంత మంది దాతలు ముందుకు వచ్చి విద్యార్థులను దత్తత తీసుకుని వారికి అండగా నిలబడాలన్నారు. పాఠశాల అభివృద్ధికి నావంతు పూర్తి సహాయ, సహకారాలను అందచేస్తానని తెలిపారు. అనంతరం పాఠశాలను, వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీ రావు, హెచ్‌ఎం వెంకట్రావ్, సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న సతీష్‌రెడ్డి, మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, తదితరులు

గణేష్ నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

నెల్లూరురూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయకుడి నిమజ్జనంలో ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు పాటించాలని నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ఆదివారం ధనలక్ష్మీపురం, కొత్తకాలువ కూడలి, జొన్నవాడ జంక్షన్, నారాయణ ఆసుపత్రి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుల నిమజ్జన వద్ద భద్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన వేడుకలు జాగ్రత్తగా జరుపుకోవాలని తెలిపారు. అతి ఉత్సాహానికి వెళితే అనార్థాలు తెచ్చుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఊరేగింపులు నిర్వహించేవారు పైనున్న విద్యుత్ తీగలను గమనించాలన్నారు. నిమజ్జనాల వద్ద నీటిలోకి వెళ్లవద్దని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రక్షణ కోసం 'వేదగిరి'లో పూజలు



వేదగిరి క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న సురేంద్రరెడ్డి, టీడీపీ శ్రేణులు, తదితరులు

నెల్లూరురూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని చంపితే డబ్బే. డబ్బంటూ రౌడీషీటర్లు మాట్లాడుకునే వీడియో బయటకొచ్చి వైరల్‌గా మారిన నేపథ్యంలో తమ నాయకుడు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి ఎలాంటి ప్రాణహాని ఉండకూడదని కోరుతూ వేదగిరి క్షేత్రంలో ఆదివారం టీడీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆలయం బయట మాట్లాడారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యేకి ఎలాంటి ప్రాణహాని ఉండకుండా లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆశీస్సులు బలంగా ఉండాలని పూజలు నిర్వహించామన్నారు.

బారాషహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

● **నెల్లూరు(సాంస్కృతికం)** : నెల్లూరు రూరల్ బారాషహీద్ దర్గాలో ముస్లిం నేతలు, మత పెద్దలు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యేపై జరుగుతున్న కుట్రల నుంచి ఆయన కాపాడబడి, ఆయన్ను దుష్టశక్తులు ఏవీ తాకకుండా ఉండాలని అల్లాహ్ దయ కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సమిహాసేనీ, షంషుద్దీన్, సాబీర్‌ఖాన్, అబూబకర్, ఇస్మాయిల్‌ఖాదరి, అబ్దుల్‌రసూల్, షేక్.మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రబాబు సేవలు అమోఘం

● **అట్టహాసంగా ఉద్యోగ విరమణ కార్యక్రమం**



రవీంద్రబాబు దంపతులను గజమాలతో సన్మానిస్తున్న రాపూరు రేంజ్ అధికారులు, సిబ్బంది

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అటవీశాఖలో రవీంద్రబాబు సేవలు అమోఘమని కావలి సబ్‌డీఎఫ్‌వో శ్రీకాంత్‌రెడ్డి, మంగళగిరి మున్సిపల్ కమిషనర్ హలీమ్‌బాషాలు పేర్కొన్నారు. రాపూరు అటవీ రేంజర్‌గా పనిచేస్తున్న పందిళ్ల రవీంద్రబాబు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు మాట్లాడుతూ దాదాపు 20 ఏళ్లపాటు అసోసియేషన్ నాయకుడిగా వందలాది మంది అటవీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన గురించి పలువురుది ఉద్యోగులు తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం రవీంద్రబాబు, ఆయన సతీమణి వాణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు అగ్నిమాపక అధికారి బాలరాజు, ఇంచార్జి రాపూరు రేంజర్ మాల్యాద్రి, పలువురు రేంజర్‌లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ఎదగాలి

నెల్లూరు(విద్య), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఉన్నతంగా ఎదగాలని మాజీ డెమో జిల్లా వైద్యాధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. తెలుగుభాషా వారోత్సవాలను పురస్కరించుకుని బుజబుజనెల్లూరు డీవీఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు అచ్యుతమణి బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్లినా పాత పాఠశాలపై మక్కువతో విద్యార్థులకు జ్ఞాపికలను, పెన్నులను అందించడం అభినందనీయమన్నారు. అనంతరం పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తన సోదరి అనసూయ పేరుతో విద్యార్థులకు జిప్ ఫైల్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, దూడల ప్రసాదరావు, వెంకట నరసయ్య, దేవరకొండ శ్రీనివాసులు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సాయి మాలధారుల శోభాయాత్ర



శోభాయాత్రలో సాయి మాలాధార భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్ శివారున పద్మావతినగర్‌లో ఉన్న సాయి దర్బార్ అద్దాల మందిరంలో సాయి మాలధారణ మండల దీక్ష, షిరిడీ యాత్ర సందర్భంగా ఆదివారం సాయి సచ్చరిత్ర శోభాయాత్ర నిర్వహించారు. సాయిదర్బార్ నుంచి 300 మంది భక్తులు సాయి సచ్చరిత్రమునకు విశేష పుష్పాలంకరణతో బయలుదేరిన ఈ శోభాయాత్ర పద్మావతి నగర్, బాలాజీనగర్, విజయ్ మహల్ గేటు మీదుగా గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్, ఏసీ నగర్, ద్వారకామయినగర్ మీదుగా తిరిగి మందిరానికి చేరుకుంది. భక్తులు పవిత్రమైన సాయి సచ్చరిత్ర గ్రంథమును పట్టు వస్త్రములో చుట్టుకుని వారి శిరస్సుపై పెట్టుకుని సాయినామ సంకీర్తనతో ఆనందాన్ని పొందారు. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులందరికీ అన్నప్రసాద వినియోగం జరిగింది. మందిర చైర్మన్ మధుసాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాబోలు రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సన్మానం



వెంకటాచలం మండలం వెంకటరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌ఎల్‌ఎన్.ప్రసాద్‌ను నెల్లూరులో ఆదివారం సన్మానిస్తున్న ఆత్మీయులు

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

వెంకటాచలం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలో ఆదివారం ఏపీటీఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టీ నారాయణ, గౌరవాధ్యక్షుడిగా గుర్రం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా డీ శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షులుగా ఓ సురేష్, డీ శుభహన్, కే వెంకటేశ్వర్లు రెడ్డి, ఎస్‌వీ రమేష్‌బాబు, కే ఆదికుమారి, కార్యదర్శులుగా బీ సురేష్, ఆర్ శ్రీనివాసులు, ఏ కృష్ణమూర్తి, చంద్రశేఖర్, పీ నాగమణి, జిల్లా కౌన్సిలర్లుగా 7 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీ టీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చేవూరు సుబ్బారావు తెలిపారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్ దశరథ రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి హజరత్ ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, వెంటనే ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకటించి డీఏలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

మనుబోలు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమ వారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్ర మంలో పాల్గొంటారని ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్లపూడి, మడ, రాజ వోలుపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే ఉదయం 9 గంటలకు పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా భయన చిరంజీవి మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలు మాలలు సమర్పించారు. ఆశ్రమ స్థల దాత పొణక కనకమ్మ విగ్రహానికి గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం విద్యార్థులకు మహాత్మా గాంధీ జీవిత విశేషాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

జై జై గణేశా.. బై బై గణేశా!

● నృత్యాలతో సందడి చేసిన యువత
● లడ్డూ వేలం.. నోట్ల వర్షం
● ఘనంగా బొజ్జగణపయ్యల నిమజ్జనం

పొదలకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జన శోభాయాత్ర ఆదివారం వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గణనాథుడిని ఉంచి నిమజ్జనోత్సవానికి తరలించారు. పట్టణంలోని వాసవీనగర్‌కు చెందిన 100 మంది మహిళా భక్తులు గ్రామోత్సవం లో గణేశుడికి ఒకేసారి కాయకర్పూరంతో హారతులు సమర్పించారు. ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. మండలంలోని పలు గ్రామాల్లో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. లడ్డూ వేలంపాటలు ఉత్సాహంగా నిర్వహించారు. రామమందిరం వీధిలోని శివసాయి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డు వేలం పాటలో భార్గవ్‌రెడ్డి రూ.51 వేలకు గణేష్ లడ్డును కైవసం చేసుకున్నాడు.

కోవూరు : మండల పరిధిలోని గ్రామాల్లో వినాయకుని ప్రతిమల్ని ఆదివారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. కోవూరు, పడుగుపాడు, పాటూరు, పోతిరెడ్డిపాళెం, గంగవరం, వేగూరు గ్రామాల్లోని యువకులు పెన్నా నదిలో, మలిదేవిలో నిమజ్జనం చేశారు. మోడేగుంట, చెర్లోపాళెం గ్రామాల యువకులు రామతీర్థం సమీపంలో సముద్రంలో, మలిదేవి వాగులో నిమజ్జనం చేశారు. పడుగుపాడులోని వినాయక ప్రతిమకు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సూరిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు. గంగవరంలో వినాయక ప్రతిమను ఊరేగించి నిమజ్జనం చేశారు. టీడీపీ నాయకులు సింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి, మన్నేపల్లి నాగేంద్ర పాల్గొన్నారు.

విడవలూరు: వినాయక నిమజ్జన వేడుకలు మండలంలో ఆదివారం ఘనంగా ముగిశాయి. పార్లపల్లిలో జరిగిన వేడుకల్లో అళగనాథస్వామి ఆలయ చైర్మన్ ఉచ్చూరు సుదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో బొజ్జగణపతిని అలంకరించి ఊరేగించారు. రామతీర్థం సమీపంలో సముద్రంలో నిమజ్జనం చేశారు. విడవలూరు, గాదెలదిన్నె, వావిళ్లలో వినాయకుడిని సముద్రంలో నిమజ్జనం చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ సురేంద్ర బాబు, ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాపూరు: గణేశ్ ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. నిమజ్జనానికి వెళ్లే ముందు లడ్డు వేలం పాట నిర్వహించగా రాపూరువాసి దామిశెట్టి సాయివిఘ్నేష్ రూ.72 వేలకు లడ్డు దక్కించుకున్నారు. గణనాథుడి నిమజ్జనం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు, ఎస్ఐ నాగార్జునరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పొదలకూరు : స్థానిక రామమందిరం వీధిలో ఆదివారం శివసాయి యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో లడ్డూ వేలం వేశారు. గేట్ సెంటర్‌కు చెందిన భార్గవ్‌రెడ్డి రూ.51 వేలకు లడ్డును దక్కించుకున్నారు. పూజల అనంతరం భార్గవ్‌రెడ్డికి నిర్వాహకులు లడ్డును అందజేశారు.

మనుబోలు: మండలకేంద్రమైన మనుబోలులో గణనాథుడికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు 80 శాతం గణేశ్ ప్రతిమలను నిమజ్జనం చేశారు. పది గణనాథుల విగ్రహాలను కండలేరు వాగులో నిమజ్జనం చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



విడవలూరు: పార్లపల్లిలో ఊరేగుతున్న గణనాథుడు



కోవూరు: గంగవరంలో గణేశ్ నిమజ్జన కోలాహలం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి నేతల వినతి



వెంకయ్యనాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాచలం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ కార్యాలయంలో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడిని ఆదివారం ఎస్సీ మోర్చా నేతలు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి అరుముళ్ల మురళి మాట్లాడుతూ మండలంలో కసుమూరు, గొలగమూడి పుణ్యక్షేత్రాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్నందున వెంకటాచలం రైల్వే స్టేషన్‌లో గూడూరు - విజయవాడ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు చొరవ చూపాలని కోరారు. వెంకటాచలంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ పని చేసేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేయాలని కోరారు. వారి వినతి పట్ల వెంకయ్యనాయుడు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వెంకటాచలం మాజీ సర్పంచ్ వలిపి మునుస్వామి పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు కోవూరు బుజ్జయ్య మృతి



కోవూరు బుజ్జయ్య (ఫైల్)

కోవూరు, ఆగస్టు 31, (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆదర్శ ఉపాధ్యాయుడు కోవూరు బుజ్జయ్య (85) ఆదివారం మృతి చెందారు. స్థానిక సీతయ్య బడిలో ఆయన ఉపాధ్యాయుడిగా ఎంతో నిబద్ధతగా పని చేశారు. విద్యార్థుల ఆసక్తిని గమనించి, ఆయా రంగాల వైపు వారిని మళ్లించి ఎంతో ప్రోత్సహించారు. ఆయన శిష్యులు ఎంతోమంది ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారు. ప్రముఖ డాక్టర్లుగా, సుప్రీంకోర్టు జడ్జిలుగా, చరిత్రకారులుగా రాణించారు. బుజ్జయ్య మృతదేహానికి సీతయ్య బడి పూర్వ విద్యార్థులు, కాపు వీధి వాసులు ఘనంగా నివాళులర్పించారు.

బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించండి

విడవలూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి నాయకులు ఆదివారం విజయవాడలోని ఆంధ్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్‌ను కలిసి విన్నవించారు. గరుడ పథకాన్ని పునరుద్ధరించాలని, తొలగించిన పింఛన్లు ఇవ్వాలని కోరారు. జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు వాసుదేవరావు, రమేష్, మణికుమార్, శ్రీనివాస శర్మ, శేషాచార్యులు, ఫణికుమార్ పాల్గొన్నారు.

చెన్నయ్య, సుధీర్‌కుమార్‌లకు పురస్కారాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 31, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు డాక్టర్ చీదరాల చెన్నయ్య నెల్లూరు టౌన్ హాల్లో ఆదివారం 'జాతీయ తెలుగు భాషా పురస్కారం' అందుకున్నారు. 'సేవ' సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషోత్సవాలు జరిగాయి. పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ చేతులమీదుగా చెన్నయ్య పురస్కారం అందుకున్నారు. అలాగే రామచంద్రాపురంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గండికోట సుధీర్ గుంటూరులో శాసన మండలి మాజీ సభ్యుడు కే ఎస్ లక్ష్మణరావు చేతులమీదుగా 'సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ పురస్కారం' అందుకున్నారు.

డ్రోన్ సాయం.. సులభంగా వ్యవసాయం!

● 80 శాతం రాయితీతో...
● ఐదుగురు రైతులు ఓ బృందంగా...
● తొలివిడతగా మూడు డ్రోన్ల పంపిణీ

పొదలకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వ్యవసాయం రైతులకు భారంగా మారింది. దమ్ముల నుంచి పంట చేతికి అందేవరకు కూలీలపై ఆధారపడి సేద్యం చేసే పరిస్థితి నెలకొంది. కూలీల కొరత, అధిక పెట్టుబడుల కారణంగా అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. వీరి అవస్థలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నుంచి రైతులకు డ్రోన్ల పంపిణీ చేసే దిశగా చర్యలు చేపట్టింది. బృందాలుగా ఏర్పడిన రైతులకు 80 శాతం రాయితీపై వీటిని అందజేస్తుంది. మండలంలో తొలివిడతగా మూడు డ్రోన్లను రైతు బృందాలకు అందజే శామన్నారు. రైతులు అవసరాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే మరో విడతలో అందించడానికి ప్రభుత్వం వ్యవసాయ అధికారులు సిద్ధంగా ఉన్నారని పొదలకూరు అగ్రికల్చర్ ఆఫీసర్ వి. ప్రతాప్ తెలిపారు.


● **దరఖాస్తు చేసుకోండిలా...**

ఐదుగురు రైతులు బృందంగా ఏర్పడి గ్రూపు పేరు నమోదు చేసుకోవాలి. సభ్యుల్లో ఒకరు ఇంటర్ చదివి ఉండాలి. ఆయనను పైలట్‌గా ఎంపిక చేసి డ్రోన్‌ను ఎలా వినియోగించాలి, ఎరువులు, సస్యరక్షణ మందుల పిచికారీ ఎలా చేయాలనే అంశాలపై 12 రోజులపాటు ప్రత్యేక తర్ఫీదునిస్తారు. ఈ శిక్షణ పొందినవారు మాత్రమే పరికరం వినియోగించాల్సి ఉంటుంది. పరికరం ఖరీదు సుమారు రూ.10 లక్షలు కాగా, సభ్యులు రూ. 2 లక్షలు చెల్లిస్తే బ్యాంకు ద్వారా మిగిలిన సొమ్ము ప్రభుత్వం అందిస్తుంది. రాయితీ మొత్తం అందేంత వరకు రూ.3 లక్షలకు నామమాత్రపు వడ్డీని సభ్యులు చెల్లించాలి. అనంతరం రాయితీ సొమ్మును సంబంధిత బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుంది. ఇది రైతులకు ఎంతో మేలని, సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.



రైతు బృందానికి డ్రోన్ అందిస్తున్న వ్యవసాయశాఖాధికారులు, నాయకులు

అవగాహన కల్పిస్తున్నాం



ఇప్పటికే రైతులకు డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించాం. కూలీల కొరత వేధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో వీటిని వినియోగించడం ద్వారా అన్నదాతలు తమ సమయాన్ని, సొమ్మును ఆదా చేసుకోవచ్చు.

- శివనాయక్, ఏడీఏ, పొదలకూరు



నెల్లూరు : గణేశ్ ఘాట్‌లో నిర్వహిస్తున్న వినాయక నిమజ్జనం

వినాయకా.. వెళ్లిరావయ్యా...!

నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఐదురోజులపాటు పూజలందుకున్న గణనాథులు ఆదివారం సాయంత్రం నిమజ్జనానికి తరలివెళ్లారు. డప్పుల చప్పుళ్లు, బాణసంచా వేడుకలు, యువకుల నృత్యాలతో సందడిగా ఊరేగింపులు సాగాయి. తీరప్రాంత మండలాల వారు సముద్రంలోనూ, నెల్లూరు, పరిసరప్రాంత వాసులు స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్‌లోనూ, ఇతర ప్రాంతాలవారు సమీపంలోని నీటి వనరుల్లోనూ వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



ఉదయగిరి : దేకూరుపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



పొదలకూరు : నిమజ్జనానికి తరలుతున్న గణేశ్ విగ్రహాలకు కాయాకర్పూరంతో హారతిస్తున్న మహిళలు



కావలి రూరల్ : తుమ్మలపెంట సముద్ర తీరంలో నిమజ్జనానికి క్యూ కట్టిన వినాయక విగ్రహాలు



ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో గణనాథుల నిమజ్జన కోలాహలం

వృద్ధులకు ప్రత్యేకం !

- 70 ఏళ్ల పైబడిన వారికి హెల్త్ కార్డులు
- జిల్లాలో ప్రస్తుతం 15,230 మందికి పంపిణీ
- కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ వైద్యచికిత్సలు
- దేశంలో ఎక్కడైనా సేవలు పొందే అవకాశం
- 'ఎన్టీఆర్ వైద్యసేవ' కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు ప్రత్యేక హెల్త్ కార్డుల ద్వారా ఉచిత వైద్యచికిత్సలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై)ను అందుబాటులోకి తెచ్చింది. దీనిద్వారా దేశంలో ఎక్కడైనా కార్పొరేట్ ఆసుపత్రిలతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనైనా వైద్య చికిత్సలు పొందవచ్చు. రూ. 5 లక్షల వరకు ఉచితంగా పొందవచ్చు. ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఈ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే రాష్ట్రానికి ఇంకా ఆదేశాలు రావాల్సి ఉంది. త్వరలో అనుమతులు వస్తాయని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ముందస్తుగా రాష్ట్రంలోని 70 ఏళ్ల పైబడిన వృద్ధులను గుర్తించి, పీఎంజేఏవై వైద్య కార్డులను పంపిణీ చేయాలని, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు అందాయి. దీంతో జిల్లాలోనూ ఈ కార్డులు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం సచివాలయాల పరిధిలో ఏఎన్ఎంలు ఇంటింటికి తిరిగి వృద్ధులను గుర్తించి, వారి పేర్లు నమోదు చేశారు. ఈ ప్రక్రియ పూర్తయి కొంతమందికి పీఎంజేఏవై వైద్య కార్డులు కూడా పంపిణీ చేశారు. కేంద్రం నుంచి అనుమతులు రాగానే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యచికిత్సలు అందచేయనున్నారు.



త్వరలో రాష్ట్రానికి అనుమతులు



త్వరలో రాష్ట్రానికి కూడా పీఎంజేఏవై పథకానికి అనుమతులు రానున్నాయి. అనుమతులు రాగానే వృద్ధులంతా కూడా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా అవసరమైన వైద్య చికిత్సలు పొందే అవకాశం ఉంటుంది. ముందస్తు అనుమతులతో ఇప్పటివరకు 15వేలకుపైగా కార్డులను పంపిణీ చేశాం. మిగిలినవారికి త్వరలో పంపిణీ చేస్తాం.

- డాక్టర్ సుధీర్‌కుమార్, ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్

● 15,230 కార్డుల పంపిణీ

జిల్లావ్యాప్తంగా 1,83,968 మంది 70ఏళ్ల పైబడిన వృద్ధులు ఉన్నారు. వారి వివరాలను సచివాలయ ఏఎన్ఎంలు నమోదు చేశారు. ప్రస్తుతం 15,230 పీఎంజేఏవై కార్డులను వృద్ధులకు పంపిణీ చేశారు. వీరిలో కొంత మంది చెన్నై లోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు కూడా పొందారు. ఈ కార్డులకు అర్హత తెల్లరేషన్ కార్డు ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైరయినవారు అనర్హులు.

పీఆర్‌సీ కమిటీని నియమించాలి

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నెల్లూరు (విద్య), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌సీ కమిటీని నియమించడంతో పాటు 30శాతం ఐర్‌ను ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేసి బోధనేతర పనులకు దూరంగా ఉంచాలన్నారు. పాఠశాలలను బలోపేతం చేసేందుకు యూటీఎఫ్ ఎంతో శ్రమించి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే పాఠశాలల్లో సెల్‌ఫోన్ రహిత బోధనకు సిద్ధం కావాలని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తొలగించాలన్న డిమాండ్‌తో ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు ప్రచారయాత్ర నిర్వహిస్తామన్నారు. పీఆర్‌సీ, ఐఆర్, డీఏ, ఆర్థిక అంశాలపై 17 నుంచి 20వ తేదీ వరకు మండల కేంద్రాల్లో ధర్నాలు, అక్టోబరు 7న జిల్లాస్థాయిలో ఆందోళన, 21న చలో విజయవాడ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి పీ.బాబురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతిశర్మ, జేవీవీ నాయకులు కృష్ణారెడ్డి, యూటీఎఫ్ నేతలు పాల్గొన్నారు.

సోమశిలకు 23,496 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి ఆదివారం 23,496 క్యూసెక్కులు వరద వస్తుండగా, 61.660 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,500, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

మద్దూరుపాడులో పిచ్చి కుక్క స్వైరవిహారం

● ఇద్దరు వ్యక్తులు, మూడు పశువులను కరచిన వైనం

కావలి,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దూరుపాడులో ఓ పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. మనుషులు, పశువులపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచింది. పిచ్చికుక్క కరవడంతో ఆదివారం కొండా వెంకట్రావు అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అలాగే సీహెచ్ వెంకటేశ్వర్లు అనే మరో వృద్ధుడిని కరిచేందుకు ప్రయత్నించగా ఆయన భయంతో పరుగులు తీశాడు. అనంతరం అక్కడే ఉన్న ఒక ఆవును, దూడను, గేదెను గాయపరిచింది. దీంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పిచ్చి కుక్క బెడద నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

ముగిసిన తెలుగు భాషోత్సవాలు



తెలుగు భాషోత్సవంలో మాట్లాడుతున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నెల్లూరు పుర మందిరంలో సేవా సమితి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలుగు భాషోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం మొదట తెలుగు సాహిత్య విమర్శ సదస్సు జరిగింది. సభాధ్యక్షుడుగా ప్రముఖ కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి వ్యవహరించగా ప్రసిద్ధ విమర్శకుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విమర్శ రాయడం చాలా కష్టమైన బాధ్యత అని, కొడవటిగంటి కుటుంబరావు, సర్దేశాయి తిరుమలరావు వంటి వారు విమర్శలోని లోతులను విశదీకరించారని తెలిపారు. కీలకోప న్యాసకులు ఆచార్య మేడి పల్లి రవికుమార్ మాట్లాడుతూ విప్పి చెప్పేది విమర్శ అనే మాటను సరిచేసుకోవాల్సిన సందర్భం వచ్చిందన్నారు. గద్దర్ సాహిత్యంపై పరిశోధన చేయకూడదని ఒక విశ్వవిద్యాలయంలో పోలీసులు వచ్చి చెప్పివెళ్లారని గుర్తు చేశారు. ఆచార్య పీసీ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి విమర్శ ఏ కోణంలో సాగుతుందో విశదీకరించారు. ఆచార్య సీహెచ్. సుశీలమ్మ మాట్లాడుతూ సాహిత్యాన్ని మొత్తం చదివేశామనడం ఈరోజు అలవాటుగా మారిందని, మంచి విమర్శకు అవార్డులు ఇచ్చే సాంప్రదాయం రావాలని కోరారు. ఉన్నం జ్యోతివాసు మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యంతో పాల్కురికి సోమ నాధుడు తొలి సామాజిక కవి అని అన్నారు. మనుచరిత్రలోని పదప్రయోగాల ప్రత్యేకతను విశదీకరించారు. శ్రీరామకవచం సాగర్ పోస్ట్ మోడర్నిజం గురించి మాట్లాడారు. డాక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కవిత్వాన్ని చక్కగా విమర్శకుడు అంచనా వేయగలడన్నారు. డాక్టర్ కవితశ్రీ మాట్లాడుతూ సాహిత్య పునర్మూల్యాంకనం నిరంతరం అవసరమన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. సేవ తెలుగు భాషా సాహితీ సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు ప్రముఖ సాహితీ వేత్తలకు సేవా గౌరవ పురస్కారం అందించారు. ఆచార్య కొలకలూరి ఇనాక్, నాగసూరి వేణుగోపాల్, గారపాటి ఉమామహేశ్వరరావు, డాక్టర్ నాళేశ్వరం శంకరం, చలంచర్ల భాస్కర్‌రెడ్డి, కుసుమకుమారి, డాక్టర్ కొణిదెల శోభ, డాక్టర్ కె.కరుణశ్రీ, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీ సీపీఎస్ఈఏ

చలో విజయవాడ

నెల్లూరు(విద్య), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు కోరుతూ ఏపీ సీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో సోమవారం చలో విజయ వాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా చైర్మన్ కే.మధుసూదన్‌రావు, సెక్రటరీ జనరల్ షేక్.జావీద్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఫ్యాప్టో మద్దతు ప్రకటించిందని తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షలకు పైగా ఉద్యోగులు సీపీఎస్ వలన ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సామాజిక భద్రత లేక ఉద్యోగానంతరం బాధలకు గురవుతూ మానసిక క్షోభ అనుభవిస్తున్నారని, దీన్ని అధిగమించేందుకు జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ వందలాదిగా కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

నేటి నుంచి నియోజకవర్గాల వారీగా

ఆధార్ నమోదు కేంద్రాలు

● ఐటీడీఏ పీహో భూమిరెడ్డి మల్లికార్జునరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధార్ కార్డులు లేని గిరిజనులు ఎంతోమంది ఉన్నారు. వారందరికీ వాటిపై సరైన అవగాహన లేకపోవడంతో పొందలేక పోతున్నారు. పైగా పనుల కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళుతుండడంతో ఆధార్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేక పోతున్నారు. అలాంటి వారి కోసం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, సోమవారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి భూమిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు.

? : నియోజకవర్గాల వారీగా ఎప్పుడు ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఎప్పటి వరకు కొనసాగిస్తారు. ఏ నియోజకవర్గంలో ఎప్పటి నుంచి ఎప్పటి వరకు కేంద్రాలు ఉంటాయి.

! : సెప్టెంబరు ఒకటి (నేటి) నుంచి నియోజక వర్గాల వారీగా ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ కేంద్రాలు నవంబరు 8 వరకు పని చేస్తాయి. సెప్టెంబరు 1 నుంచి 6 వరకు కావలి, 7 నుంచి 13 వరకు కందుకూరు, 14 నుంచి 20 వరకు కోవూరు, 21 నుంచి 27 వరకు సర్వేపల్లి, 28 నుంచి అక్టోబరు 4 వరకు ఆత్మకూరు, 5 నుంచి 18 వరకు ఉదయగిరి, 19 నుంచి 25 వరకు నెల్లూరు రూరల్, 26 నుంచి నవంబరు ఒకటి వరకు నెల్లూరు సిటీ, 2 నుంచి 8వ తేదీ వరకు వెంకటగిరి నియో జక వర్గంలోని కలువాయి, రాపూరు, సైదాపురంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

? : ఇప్పటి వరకు ఎంతమందికి అందచేశారు.

! : జిల్లాలో మండలాల వారీగా ఈ ఏడాది మే వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఐదు వేల మంది గిరిజనులకు ఆధార్ కార్డులు అందచేశాం. వీరందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందుతోంది.

? : ఆధార్ లేని గిరిజనులను గుర్తించారా.

! : మండలాల వారీగా గుర్తించాం. వారు వలస వెళ్లడం వలన ఆధార్ తీసుకోలేక పోయారు. ఉన్న వారిని గుర్తించాం. ఆధార్ కార్డులేని వారికి డొమి సైల్ సర్టిఫికెట్లు ఏర్పాటు చేసి ఆధార్ కోసం నమో దు చేయిస్తున్నాం. వారికి ఆధార్ అందేలా చేస్తున్నాం.



? : గిరిజనుల కోసం ప్రత్యేక పీజీఆర్ఎస్ ఏర్పాటు చేస్తున్నారా.

! : జిల్లాలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సెప్టెంబరు 6న నిర్వహిస్తున్నాం. ఈ కార్య క్రమం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయాల్లో నిర్వహిస్తున్నాం. ఈ పీజీఆర్ఎస్‌లో గిరిజనుల సమస్యలను స్వీకరించి పరిష్కరిస్తాం.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతంలోని సీతారామపురం మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై బస్సు, కారు ఢీకొన్న సంఘటన ఆదివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సీతారామపురం నుంచి ఉదయగిరికి వస్తున్న ఆర్టీసీ బస్సు పట్టణంలోకి వచ్చేందుకు మలుపు తిరుగుతుండగా మర్రిపాడు మండలం నాగరాజుపాడు నుంచి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు కారులో స్వగ్రామమైన ఉదయగిరి మండలం నేలటూరుకు వెళుతూ బస్సును ఢీకొన్నారు. ఈప్రమాదంలో బస్సు, కారు ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

వయోజన విద్యలో పోస్టుల భర్తీకి

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వయోజన విద్యాశాఖలో ఖాళీగా ఉన్న నాలుగు పర్యవేక్షకుల పోస్టులను డిప్యుటేషన్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నోడల్ ఆఫీసర్ ఎం.మస్తాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖలో ఎస్‌జీటీ, పీఈటీ, గ్రేడ్-2 భాషా పండితులు ఈ పోస్టులకు ఈనెల 5వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు కనీసం పదేళ్ల ఉద్యోగ అనుభవంతో పాటు 45 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికలో ఉన్నత విద్యార్హత, మండల, జిల్లా, రాష్ట్ర లిటరసీ ఆర్గనైజర్ లేదా రీసోర్స్ గ్రూపుల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. మాస్ కమ్యూనికేషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాజాతాలలో పని చేసిన అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలను జత చేయాలని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి సెలక్షన్ కమిటీ అభ్యర్థులను ఎంపిక చేస్తుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 9వ తేదీన నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు వయోజన విద్యాశాఖ కార్యాల యంలో దరఖాస్తులను స్వయంగా సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849909209, 8919151149ను సంప్రదించాలని తెలిపారు.

కేరళలో చేజర్ల వైద్యుడి ఘనత

- ఏడాదిలో వేయి గుండె ఆపరేషన్లు
- అన్నీ కూడా విజయవంతం



పోస్ట్ యాంజియోప్లాస్టీ మీట్‌లో మాట్లాడుతున్న డాక్టర్ అల్లం రామ్‌రమేష్

చేజర్ల, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి) : కుగ్రామంలో పుట్టి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, వైద్యుడిగా రాణిస్తూ వేయి గుండె ఆపరేషన్లను విజయవంతంగా చేసిన ఘనత చేజర్లకు చెందిన డాక్టర్ అల్లం రామ్‌రమేష్ దక్కింది. వివరాల్లోకి వెళితే.. చేజర్లకు చెందిన డాక్టర్ రామ్‌రమేష్ కేరళలోని కాలికట్‌లోని శాంతి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పదేళ్లుగా కార్డియాలిస్ట్‌గా పనిచేస్తు న్నారు. అయన గత ఏడాదికాలంలో చేసిన వేయి గుండె అపరేషన్లు విజయవంతం అయ్యాయి. దీంతో శనివారం ఆ వైద్యశాలలో ఏర్పాటు చేసిన పోస్ట్ యాంజియోప్లాస్టీ మీట్ - 2025 సభలో ఆయన్ను ఆరాష్ట్ర ప్రముఖులు, సహచర వైద్యులు ఘనంగా సత్కరించారు. ఈ సభలో ఆపరేషన్లు చేయించుకున్న వేయిమంది రోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆయన ఈ విజయం సాధించడం పట్ల స్వగ్రామంలోని కుటుంబ సభ్యులు, చేజర్ల గ్రామస్థులు, మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతానికి బాలుడి బలి



మృతి చెందిన సమీవుల్లా

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంసాలివీధిలో విద్యుదాఘాతానికి గురై షేక్ సమీవుల్లా(10) మృతిచెందాడు.ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు కథనం మేరకు.. యూనియన్ రోడ్డుకు చెందిన షేక్ నూరేమస్మూద్, సబియా దంపతుల కుమారుడు సమీవుల్లా నార్త్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. సమీప కంసాలీవీధిలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికెళుతూ సమీపాన ఉన్న ఇనుపపైపును పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వైద్యశాలకు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా తన సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఎన్‌టీఏ జిల్లా కార్యవర్గం ఏర్పాటు



ఎన్‌టీఏ నూతన కమిటీని అభినందిస్తున్న నేతలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలోని ఎన్‌టీఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులరాజు మాట్లాడుతూ గడిచిన కొన్నేళ్లుగా పీఆర్‌టీయూలో కొనసాగిన నేతలు అధిక సంఖ్యలో తమ అసోసియేషన్‌లో చేరడం ఆనందంగా ఉందన్నారు. వీరితో నూతన కమిటీని ఏర్పాటు చేసి విద్య, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడుగా నాటకం తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.చెన్నయ్య, గౌరవాధ్యక్షుడుగా డీ.వెంకటరాజు, క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడుగా చంద్రశేఖర్‌రెడ్డి, ఆత్మకూరు ఇన్‌చార్జిగా రహమతుల్లాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకట్రావ్ జయప్రకాష్‌నాయుడు, రెడ్డి రమేష్, జిల్లా నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, ఎస్‌కె.రఫీ, సురేష్, హరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9909
వెండి కిలో ధర	రూ. 123700
వెండి ఒక గ్రాము	రూ.126.70

క్రీడలతో మానసిక, శారీరక దారుఢ్యం: ఎమ్మెల్యే దగుమాటి

కావలి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం లభిస్తుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక 16వ వార్డులోని చంద్రబాబునగర్ కాలనీ ఇండోర్‌లో ఏర్పాటు చేసిన వర్ష ఉడ్‌బ్యాడ్మింటన్ కోర్టును ఆదివారం ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి సరదాగా బ్యాడ్మింటన్ ఆడారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో క్రీడలు, వ్యాయామానికి కొంత సమయం కేటాయిస్తే ఆరోగ్య భాగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

3న రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం రాష్ట్రప్రభుత్వం చేపట్టిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతులకు సంఘీభావంగా పోరాట కార్యాచరణ కోసం సెప్టెంబరు 3వ తేదీన కందుకూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో రైతుసంఘాల సమన్వయ సమితి, ప్రజాసంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రైతులు, కూలీలు, మేధావులు, వివిధ ప్రజాసంఘాల నేతలు, ప్రజాస్వామిక వాదులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కరేడులో పరిణామాలపై ఏడీబీకి ఫిర్యాదు

● ఆప్ నేత నేతి మహేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కరేడులో ఇండోసోల్ కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న బలవంతపు భూసేకరణపై ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ)కి ఫిర్యాదు చేయనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక పరిశీలన, స్థానికుల ఆమోదం లేకుండా భూసేకరణ చేయటం ఏడీబీ నిబంధనలకు విరుద్ధమని, నిబంధనలు పాటించని సంస్థలకు ఏడీబీ రుణం ఇవ్వదని, అందుకే ఇక్కడి పరిస్థితులపై ఏడీబీకి ఫిర్యాదు చేయటం ద్వారా బలవంతపు భూసేకరణకు అడ్డుకట్ట వేసేందుకు మావంతు ప్రయత్నం చేస్తామన్నారు.

వెంకటరమణయ్య సేవలు ఎనలేనివి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో 42 సంవత్సరాల పాటు వివిధ హోదాలలో పనిచేసిన ఎస్ఐ ఎంవీ రమణయ్య సేవలు ఎనలేనివని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు రూరల్ ఎస్ఐగా ఉద్యోగ విరమణ చేసిన రమణయ్యను ఆదివారం స్థానిక వెంగమాంబ ఫంక్షన్ హాలులో సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు, సిబ్బందితోపాటు వివిధ పార్టీల నేతలు, రమణయ్య మిత్రులు ఘనంగా సత్కరించారు. డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రమణయ్య కందుకూరు ప్రాంతంలోని వివిధ పోలీసుస్టేషన్‌లలో సేవలందించాడని కొనియాడారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



వేంకటేశ్వరస్వామి, గణనాథుడి విగ్రహాలతో ఆకట్టుకుంటున్న సెట్టింగ్



కావలి(టౌన్)ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని కలుగోళశాంభవీ దేవి ఆలయ ప్రాంగణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగు తున్నాయి. కమిటీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మీ దంపతుల పర్యవేక్షణలో 9 రోజుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సింగపేటకు చెందిన శిల్పి శేషాచార్యులు 22 అడుగుల గణనాథుని ప్రతిమను అద్భుతంగా తీర్చిదిద్దారు. మండపం చుట్టూ వివిధ దేవతా మూర్తుల ప్రతిమలు, ప్రత్యేక సెట్టింగులో ఏర్పాటు చేయడంతో ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో పులకిస్తోంది. ప్రఖ్యాత కళాకారులచే ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తజనానికి కనువిందు చేస్తున్నాయి. రాత్రి 8 గంటలకు తియ్యబండి కళ్యాణ్ ఆచార్యుల బృందంచే నిర్వహిస్తున్న దశ హారతుల కార్యక్రమంలో పాల్గొని భక్తులు తన్మయం చెందుతున్నారు. ప్రత్యేక అర్చనలతో ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు వేలాదిగా తరలివచ్చి గణనాథుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

కావలి రూరల్: వినాయక చవితి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజల అనంతరం వినాయకులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో డప్పులు, డీజే మోతల మధ్య ఘనంగా ఊరేగించారు. మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం సముద్ర తీరంలో ఆదివారం వినాయక నిమజ్జన వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. సముద్ర తీరం భక్తులతో కిటకిటలాడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ రాజేశ్వరరావు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో వినాయక విగ్రహాలున్న వాహనాలను మాత్రం తీరం వెంట పంపించి, మిగిలిన వాహనాలను బంకింగ్ హోమ్ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ పాయింట్‌లో ఉంచారు. తుమ్మలపెంట తీరంలో పోలీస్ అవుట్ పోస్టు, ఫెడ్ లైట్లు ఏర్పాటు చేసి పోలీసులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. రూరల్ ఎస్ఐలు తిరుమల రెడ్డి, బాజీబాబు, సిబ్బంది, మెరైన్ ఎస్ఐ జానకీరామ్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వినాయకుడికి ఎమ్మెల్యే ఇంటూరి పూజలు



కందుకూరులోని వాసవీ గ్రంథాలయం వినాయక మండపం వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలుచోట్ల వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. పట్టణంలోని వాసవీ గ్రంథాలయంలో కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో మురారిశెట్టి వెంకటసుబ్బారావు, కొత్త వెంకటేశ్వర్లు, కొత్తూరి వెంకటసుధాకర్, కాకుమాని ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట గ్రామంలో వినాయక మండపంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో అత్తంటి నాగేంద్రరావు, అత్తంటి శ్రీహరినాయుడు, అత్తంటి మధు, గుండవరపు లక్ష్మీనరసింహ్మం తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా పలు గ్రామాలలో భక్తుల పూజలందుకున్న గణేశ్ విగ్రహాలు ఆదివారం నిమజ్జనానికి తరలి వెళ్ళాయి. వినాయక మండపాల నుండి గ్రామాల్లో స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. కలిగిరి పట్టణంలోని పాతూరు మహిళలు గ్రామోత్సవంలో ప్రదర్శించిన కోలాటం పట్టణవాసులను అలరించింది. మేళతా ళాలు, డీజేల మోతలతో రంగులు చల్లు కుంటూ సముద్రతీరానికి తీసుకెళ్ళి నిమజ్జనం చేశారు.

లింగసముద్రం: వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన విగ్రహా లను ఆదివారం నిమజ్జనం చేశారు. మండలంలోని పెద పవని, ముత్యాలపాడు, యర్రారెడ్డి పాలెం, తిమ్మారెడ్డిపాలెం, మాలకొండ రాయుని పాలెం, లింగసముద్రం, వీఆర్ కోట, గంగ పాలెం, వీఆర్ కోట, పెంట్రాల, అన్నెబోయిన పల్లి, చీమలపెంట గ్రామాలలో విగ్రహాలను ఆయా గ్రామాలలోని చెరువులు, రాళ్లపాడు ప్రాజెక్టు, రామాయపట్నం వద్ద సముద్రంలో నిమజ్జనం చేశారు.

గణనాథుడికి 108 రకాల నైవేద్యం

● 'మెతుకు' కుటుంబానికి రూ. 45 వేలకు స్వామి వారి లడ్డూ



గణనాథుడికి అర్పించిన 108 రకాల ప్రసాదాలు

బిట్రగుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో వినాయకచవితి వేడుకల్లో భాగంగా ఆదివారం నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. బోగోలు విజయ గణపతి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన గణనాథునికి స్థానిక భక్తులు 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా అందజేశారు. భక్తులు పోటాపోటీగా రు. వినాయకస్వామి వద్ద ఉంచిన లడ్డు ప్రసాదాని వేలం పాటలో మెతుకు రాజేశ్వరి కుటుంబ సభ్యులు రూ. 45 వేలకు సొంతం చేసుకున్నారు. కమిటీ సభ్యులు సాంప్రదాయక లడ్డును మెతుకువారి కుటుంబానికి చేర్చారు. అనంతరం బోగోలు యాదవపాలెం, చెంచులక్ష్మీపురం, నాగులవరం, తాళ్ళూరు, బిట్రగుంట తదితర గ్రామాల నుంచి వినాయక విగ్రహాలను ఆనందోత్సాహాల మధ్య ఊరేగించి నిమజ్జనం చేశారు. జరిగాయి. ఎస్వీ పాలెంలో ఆక్వా రైతులు ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాన్ని తెల్లవారుజామున నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

జమునకు 'తెలుగు తేజం' పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కవయిత్రి జమున

కావలి(టౌన్) ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): కావలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని, కవయిత్రి ఎం జమునకు 'తెలుగు తేజం' అవార్డు లభించింది. ఆదివారం పల్నాడు జిల్లా నర్స రావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి సభ నిర్వహిం చారు. ముఖ్య అతిథి, ఎమ్మెల్యే చదలవాడ అరవింద్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా జమున ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాషాభి వృద్ధికి జమున చేసిన కృషికి ఈ అవార్డు లభించడం హర్షణీ యమని పలువురు కళాకారులు, కవులు ఆమెను అభినందించారు.

వినాయకుడి లడ్డూ వేలం

లింగసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురంలో రెండు వినాయకుని విగ్రహాల మండపాల వద్ద ఆదివారం వినాయకుడి లడ్డు వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని పాఠశాల వద్ద నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన కనకం వెంకటేశ్వర్లు రూ.40 వేలకు లడ్డు దక్కించుకున్నారు. అలాగే గ్రామంలోని మిట్టపాలెం వద్ద నిర్వహించిన వేలంలో వెలుగు వీరాంజనేయులు రూ. 95వేలకు లడ్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మండపాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేటి నుంచి ఆధార్ నమోదు ప్రారంభం

బిట్రగుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల పరిధిలోని షెడ్యూల్ తెగల వారికి సెప్టెంబరు 1 నుంచి 6 వ తేదీ వరకు ఆధార్ నమోదుతో పాటు, మార్పులు, చేర్పుల ప్రక్రియ కోసం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తునట్లు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళాలు

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం అనివేటి మండపం నిర్మాణానికి ఆదివారం భక్తులు విరాళాలు అందజేశారు. దివి కోటేశ్వరరావు, అనూరాధ దంపతులు రూ. 25వేలు, పొన్నూరు వెంకటమోహనరావు, వెంకటసుజాత దంపతులు రూ. 5వేలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, మంచిరాజు మురళికు అందజేశారు.

దామిశెట్టి క్రీడా ప్రతిభా అవార్డుల ప్రదానం

కావలి(టౌన్)ఆగస్టు(ఆంధ్రజ్యోతి) స్థానిక మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ప్రతిభావం తులైన క్రీడాకారులకు దామిశెట్టి క్రీడా ప్రతిభా అవార్డులు ప్రదానం చేశారు. కళాశాల కార్యదర్శి బాలసురేష్‌బాబు, కరస్పాండెంట్ సుధీర్‌నాయుడులు మాట్లాడుతూ డీబీఎస్ వ్యవస్థాపకులు, తమ తండ్రి దివంగత దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు గొప్ప క్రీడా పోషకులని గుర్తు చేసుకున్నారు. ఆయన జ్ఞాపకార్థం ప్రతిఏటా ప్రతిభావంతులైన క్రీడాకారులకు దామిశెట్టి క్రీడా ప్రతిభా అవార్డులు అందజేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో పీడీ శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు మద్దతివ్వండి

● వెంకయ్యనాయుడికి జిల్లా సాధన సమితి నాయకుల వినతి



వెంకయ్యనాయుడికి వినతిపత్రం అందచేసిన జిల్లా సాధన సమితి నాయకులు

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న ఉదయగిరిని జిల్లాగా చేసేందుకు మద్దతివ్వాలని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును ఆదివారం మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి జిల్లా ఉద్యమ నేతలు స్వరభారత్ ట్రస్టులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా, డివిజన్, మండలాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి ప్రజాభిప్రాయం సేకరిస్తున్న సందర్భంగా నేతలు ఆయన్ను కలిశారు. రెండు పర్యాయాలు ఉదయగిరి ఎమ్మెల్యేగా పనిచేసిన వెంకయ్యనాయుడికి ఇక్కడి స్థితిగతులన్నీ అవగాహన ఉన్నందున జిల్లా చేసేందుకు మద్దతివ్వాలని కోరామన్నారు. నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు షేక్‌ఎండీ ఖాజా, పాముల రమణయ్య, ఎల్‌సీ రమణారెడ్డి, మూలె బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు మండలాన్ని మినహాయించి ఏడు మండలాలకు సంబంధించిన 39 మంది బాధితులకు సుమారు రూ.50లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం పంపిణీ చేశారు. వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి అందరూ తోడ్పాటును అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు గూడా నరసారెడ్డి, సీహెచ్ బయన్న, మధుమోహన్‌రెడ్డి, వింజమూరు సొసైటీ ఛైర్మన్ చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, సీనియర్ నాయకులు పోలుబోయిన చంద్రబాబునాయుడు, యారవ కిష్టయ్య, సర్పంచ్ పీవీ నాయుడు, బొల్లినేని వెంకటరామారావు, మంచాల శ్రీనివాసులునాయుడు, ఏగినేని శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్లను సన్మానించిన సొసైటీ పాలకవర్గం

ఉదయగిరి : స్థానిక కొట్టాలపల్లి సొసైటీ పాలకవర్గం ఆదివారం వింజమూరు టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, డైరెక్టర్లు బొజ్జా నరసింహారావు, నల్లిపోగు రాజా, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, జాఫర్‌మొహిద్దీన్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా బాణసంచా పేలి తీవ్ర గాయాలపాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారులను ఆదివారం మాజీ ఎంపీపీ, వైసీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు చేజర్ల సుబ్బారెడ్డి పరామర్శించి వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బాలిబోయిన శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం



సంగం: బాలగణేశుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



సీతారామపురం : బొజ్జ గణపయ్య నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు

సంగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని పలు గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను ఆదివారం పెన్నానదిలో నిమజ్జనం చేశారు. మండలంలోని ఉడ్‌హౌస్‌పేటలో ఏర్పాటు చేసిన బాలగణేశుడిని గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం యువకులు సంగం పెన్నానదిలో నిమజ్జనం చేశారు. అదేవిధంగా సంగం రాళ్లచెలిక వీవర్స్ కాలనీ, ఎస్టీ కాలనీ, సాయినగర్, కొత్తూరు తదితర ప్రాంతాల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

● **ఉదయగిరి:** వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయగిరి పట్టణంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలతోపాటు మండలంలోని గంగిరెడ్డిపల్లి, గండిపాళెం, దేకూరుపల్లి తదితరగ్రామాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ నిమజ్జనానికి తరలించారు. పలు మండపాల వద్ద లడ్డూల వేలంపాట నిర్వహించడంతో భక్తులు పోటీలు పడి దక్కించుకున్నారు. ఉట్టి మహోత్సవం అనంతరం విగ్రహాలను సమీపంలో ఉన్న నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **సీతారామపురం:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలు ఆదివారం నిమజ్జనానికి తరలాయి. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని కోటవీధి పోతురాజు వద్ద, పరమటివీధి, రాజుగారి వీధి, బెస్తకాలనీ, తోట కాలనీలలో ఏర్పాటుచేసిన విగ్రహాల వద్ద లడ్డూ వేలపాట నిర్వహించారు. అలాగే యువత ఉట్టి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం గణనాథుడి నిమజ్జనోత్సవం నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ వెంకట్రావు, ఎస్సై శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాలలో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

శాకాహారంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు

సంగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద్ సామ్రాజ్యం పిరమిడ్ ధ్యాన కేంద్రం రెండవ వార్షికోత్సవ సప్తాహం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో శాకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక వెంకయ్యస్వామి ఆలయం నుంచి రాజరాజేశ్వరిదేవి ఆలయం వరకు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాంసాహారం వదిలి ప్రతి ఒక్కరూ శాఖాహారం వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ సామ్రాజ్యం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



జెండా ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో 5వ ఏరియా రైతుసంఘం మహాసభ నిర్వహించారు. తొలుత జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ సరికాదన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పూర్తిచేసి సీతారాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకు వెంకటయ్య, ఎంపీటీసీ విజయమ్మ, మట్టి హరినారాయణ, పావులూరి నాగేశ్వరరావు, పచ్చవ వెంకటేశ్వర్లు, కోడె రమణయ్య, పందిళ్ల వెంకటేశ్వర్లు, నాయబ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా తొమ్మిది మంది సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు వారిలో అధ్యక్ష, కార్యదర్శులుగా పచ్చవ వెంకటేశ్వర్లు, కాకు వెంకటయ్యలతోపాటు మరో ఏడుగురు సభ్యులను ఎంపిక చేశారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు నల్లబోతుల వెంకటరమణ(44) ఆదివారం మృతిచెందారు. దుత్తలూరు మండలం నందిపాడు గ్రామానికి చెందిన వెంకటరమణ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పాఠశాల ఇన్‌చార్జి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గుంటుపల్లి శ్రీనివాసరావు, షేక్ షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వెంకటరమణ మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తంచేశారు.

నాగారపమ్మకు పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోలేరమ్మకు పొంగళ్లు



పొంగళ్ల సామగ్రితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా పొంగళ్ల సామాగ్రితో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా దొరసానమ్మ గంధ మహోత్సవం

ఏఎస్ పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా హబీబాఖాతూన్ (దొరసానమ్మ) గంధ మహోత్సవంలో భాగంగా ఆదివారం దర్గా తాత్కాలిక సజ్జాద ఎస్‌జీఎస్ ఫయాజ్ అహ్మద్ నివాసంలో గంధం దంచే కార్యక్రమం నిర్వహించగా మహిళా భక్తులు గంధం దంచారు. అనంతరం గంధానికి సుగంధ తైలాలు కలిపి గంధ కలశంలో అర్ధరాత్రి దర్గాకు తరలించి సమాధులకు లేపనం చేశారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3

తిరుపతి

జిల్లా వార్తలు

సోమవారం 1 సెప్టెంబరు 2025





వెళ్లిరా.. వినాయకా

ఒకవైపు డప్పుల శబ్దం.
మరోవైపు జైజై గణేశా,
గణపతి బొప్పా మోరియా..
అంటూ నినాదాలు.
విగ్రహాల ఊరేగింపు ముందు
చిందేస్తున్న యువత.
ఇలా ఆదివారం తిరుపతి
నగరంలో సందడి నెలకొంది.
ఆయా కూడళ్లలో విగ్రహాలు ప్రతిష్ఠించిన ఐదో రోజు వినాయక నిమజ్జనం జరిగింది. ఆయా విగ్రహాలను రూట్‌మ్యాప్ ప్రకారం వినాయక సాగర్‌కు తరలించారు. కొందరు ఇళ్ల వద్ద పూజలు చేసుకున్న ప్రతిమలనూ తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. భారీ బందోబస్తు, పటిష్ట ఏర్పాట్లతో ఈ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి











ముగిసిన వేనాడు దర్గా గంధోత్సవం

తడ మండలం వేనాడులోని షేక్ దావూట్ షా వలీల్లాహ్ అల్లాతాత దర్గా గంధోత్సవం ముగిసింది. శనివారం రాత్రి నుంచి వర్షం కురుస్తున్నా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆదివారం తెల్లవారుజామున వర్షం పడుతుండటంతో గంధాన్ని గ్రామంలో ఊరేగించలేదు. దర్గా ప్రాంగణంలోనే ఉంచి ముస్లిం మత పెద్దలచే పూజలు చేశారు. ఆ తర్వాత గంధం, చాదర్‌ను బాబా సమాధి చుట్టూ ప్రదర్శనగా తీసుకొచ్చి ప్రార్థనల తర్వాత గంధాన్ని సమాధికి లేపనం చేసి పంచి పెట్టారు. గంధోత్సవంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సోదరి రెహనా బేగం, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తదితరులు దర్గాను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

- తడ, ఆంధ్రజ్యోతి



బాబ సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

డంపింగ్ యార్డుకు రాజకీయ రంగు

- ప్రభుత్వం కేటాయించిన స్థలంపై పక్క గామస్తుల ఆందోళన
- వైసీపీ నాయకుల ప్రమేయంపై ఆరోపణలు



కొణ్ణంబట్టు గ్రామ సర్వే నెంబరు 131లో డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమి ఇదే

సూళ్లూరుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీకి కేటాయించిన డంపింగ్ యార్డు స్థలంపై వివాదం చెలరేగుతోంది. ప్రభుత్వం కేటాయించిన భూమికి రాజకీయ రంగు పులుముకుంది. పక్క మండలానికి చెందిన గ్రామస్తులు వచ్చి చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చే ట్రాక్టర్లను అడ్డుకుంటున్నారు. వీరి ఆందోళన వెనుక స్థానికంగా కొందరు వైసీపీ నాయకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

ప్రభుత్వం డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమి సూళ్లూరుపేట మండలం కొణ్ణంబట్టు గ్రామ పరిధిలోనిది. అయితే, ఇక్కడ డంపింగ్ యార్డు వద్దంటూ పది కిలోమీటర్లకుపైగా దూరమున్న.. వరదయ్యపాళెం మండలం ఇసకపాలెం గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. డంపింగ్ యార్డుకు సమీపంలోని చెరువు జలాలు కలుషితమవుతాయని చెబుతున్నారు. ఇక ఈ స్థలానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని కొణ్ణంబట్టు, పెరిమిటిపాడు గ్రామాల ప్రజలు మాత్రం ఆందోళనలో పాల్గొనడం లేదు. ఇసకపాలెం గ్రామస్థుల అభ్యంతరం వెనుక.. కొందరు వైసీపీ నేతల హస్తముందన్న విమర్శలున్నాయి. ఎందుకంటే ఆందోళనకు వచ్చిన వారిలో ఆ పార్టీ సానుభూతిపరులు ఎక్కువగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమిని వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. ఇప్పటికీ అదే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇక, సూళ్లూరుపేట మున్సిపాలిటీకి సంబంధించి దశాబ్దాల నుంచి డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. దీంతో కొణ్ణంబట్టు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 131లో 10 ఎకరాలను కేటాయిస్తూ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీకి సంబంధిత పత్రాలు, స్థలాన్ని అప్పగించారు. దీంతో చెత్త, వ్యర్థాలను తీసుకుని మున్సిపాలిటీ ట్రాక్టర్లు, ఈ-ఆటోలు డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలానికి వెళ్లాయి. ఎప్పటికైనా ఆ స్థలాన్ని కబ్జా చేయొచ్చన్న ఉద్దేశ్యంతో ఉన్న ఆ వైసీపీ నేతలు.. డంపింగ్ యార్డుకు స్థలాన్ని ఇవ్వకుండా అడ్డుకునేందుకు.. మరోవైపు కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఇసకపాలెం గ్రామస్తులను ఉసిగొల్పినట్లు విమర్శలున్నాయి. ఈ క్రమంలో డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలం వద్దకు వచ్చిన వాహనాలను ఇసకపాలెం గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. నాలుగు రోజుల నుంచీ ఈ వివాదం కొనసాగుతోంది. అధికారులు సర్దిచెబుతున్నా ఆందోళనకారులు వినడం లేదు. ఈ ఆందోళనకు కొణ్ణంబట్టు పంచాయతీ పరిధిలోని గ్రామాలవారు మాత్రం రాలేదు. ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపుతూ జిల్లా అధికారులు డంపింగ్ యార్డు స్థలాన్ని కేటాయిస్తే.. కొందరు సమస్యను మళ్లీ జటిలం చేస్తున్నారు. ఈ సమస్యలను మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లారు.

మహిళా పార్లమెంటేరియన్ల సమావేశానికి వేదిక ఖరారు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీలల్లో జరగనున్న మహిళా పార్లమెంటేరియన్ల సమావేశానికి తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను వేదికగా ఖరారు చేశారు. దేశవ్యాప్తంగా 300మంది మహిళా ప్రజాప్రతినిధులు హాజరయ్యే ఈ సమావేశాన్ని 14న ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. అదే రోజు సాయంత్రం 7 గంటలకు చంద్రగిరిలో లైటింగ్‌షో వీక్షించనున్నారు. 15వ తేదీ జరిగే ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. అవుతారు. మధ్యాహ్నం తర్వాత మహిళా ప్రతినిధులు, శ్రీకాళహస్తి, షార్, శ్రీసిటీని సందర్శించున్నారు. అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ సదస్సు ఏర్పాట్లను మంగళవారం అసెంబ్లీ సెక్రటరీ జనరల్, ఇతర అధికారులు పరిశీలించనున్నారు. అతిథులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.



శేషుడిపై గణపతి చిద్విలాసం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాణిపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు ఆదివారం రాత్రి స్వర్ణ పెద్ద శేష వాహనంపై విహరించారు. వర్షం పడటంతో అర్ధరాత్రి 12గంటల తర్వాత ఊరేగించారు. ఉదయం చిన్న శేష వాహనంపై ఉత్సవర్లు ఊరేగారు. ఈ సందర్భంగా ఉభయదారులు కలశాల ఊరేగింపును వేడుకగా నిర్వహించారు. సోమవారం ఉదయం వరసిద్ధుడికి చిలుక వాహన సేవ, రాత్రి వృషభ వాహన సేవ నిర్వహించనున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

యువకుడి హత్యకేసులో ఇద్దరి అరెస్టు
బైక్, రెండు ఫోన్‌ల స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన అటుపాక శివయ్య(25) హత్య కేసులో ఇద్దరు నింతితులను అరెస్టు చేసినట్లు సీఐ రమణ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన శివయ్య, అదే గ్రామానికి చెందిన మూలింటి ముని జానకీ రాం, పోలురు సాయికుమార్ స్నేహితులు. వారి కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. మంగళవారం ముని జానకీరాం ఫోన్ చేసి శివయ్యను ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రమ్మని పిలిచాడు. అప్పటికే అక్కడున్న ముని జానకీరాం, సాయికుమార్, శివయ్యతో కలిసి క్రాస్‌రోడ్డులో మద్యం బాటిళ్లు కొనుగోలు చేశారు. రైల్వేస్టేషన్ సమీపంలోని జామాయిల్ తోటలోకి వెళ్లి మద్యం తాగారు. శివయ్య మద్యం మత్తులో ఉండగా సాయికుమార్ పాత కక్షలను గుర్తు చేశాడు. తన తండ్రి, అక్క మరణానికి శివయ్య కుటుంబీకులే కారణం నిందించాడు. కర్ర, ఇనుపరాడ్డుతో శివయ్యను బలంగా కొట్టాడు. శివయ్య పారిపోవడానికి ప్రయత్నించగా సాయికుమార్ బీరు బాటిళ్లతో గొంతు వద్ద పొడిచి చంపేశాడు. బుధవారం ఉదయం జామాయిల్ చెట్ల మధ్య శివయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం స్థానిక ఈఎస్ఎస్ కళశాల వద్ద నిందితులు ముని జానకీరాం, సాయికుమార్‌ను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఒక బైక్, రెండు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా, రిమాండ్ విధించారు. అనంతరం నెల్లూరు జైలుకు తరలించామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది రాజేంద్ర, చక్రి, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట ఏఎంసీలో ఓజిలినుంచి ముగ్గురికి చోటు





కూచివాడ పవిత్రారెడ్డి, కొండూరు సౌమ్య, కాటూరు కోటేశ్వరరావు

ఓజిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలో ఓజిలి మండలం నుంచి ముగ్గురికి చోటు దక్కింది. మండలంలోని మానమాలకు చెందిన కూచివాడ పవిత్రారెడ్డి, గుర్రంకొండకు చెందిన కొండూరు సౌమ్య, ఓజిలికి చెందిన కాటూరు కోటేశ్వరరావును ఏఎంసీ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ఆదివారం నాయుడుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బెటాలియన్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

వెంకటగిరి టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 9వ బెటాలియన్‌లో కమాండెంట్ ఈఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం 'ఫిట్ ఇండియా... ఫిట్ ఆంధ్రప్రదేశ్... సండేస్ ఆన్ సైకిల్ విత్ స్టేట్ పోలీస్ ఫోర్సెస్' కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన జాతీయ క్రీడోత్సవాలు

కోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జాతీయ క్రీడా దినోత్సవ సంబరాలు ముగిశాయి. ఇంజనీరింగ్ విద్యార్థుల సైకిల్ ర్యాలీని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రాంగణం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీడీ మల్లికార్జున రెడ్డి, శోభారాణి, రాముకుమార్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

వెంకన్నపాళెం వాసికి డాక్టరేట్



కోట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వెంకన్నపాళెం గ్రామానికి చెందిన సుకుమార్‌కు డాక్టరేట్ లభించింది. హైదరాబాదులోని ఐఐసీటీలో సీనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సుకుమార్ ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో సుకుమార్ 'న్యూసింటటిక్ మేత లాడజీస్ ఫర్ బెంజిమీజూజా, ఇసోక్వీనోలిన్ అండ్ అజా ఫ్లవానోన్స్ అండ్ కంపోర్ బేస్డ్ ఎనినో ఆసిడ్ ఆన్ న్యూటర్న్ హిందూ సింగ్ టేంప్లేట్' అనే పీహెచ్‌డీ పూర్తిచేశాడు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆటో చోరీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఆటో చోరీకి గురైంది. పెళ్లకూరు మండలం అర్లపాడు గ్రామానికి చెందిన గంగయ్య తన కుమార్తెకు పురిటి నొప్పులు రావడంతో శనివారం రాత్రి ఆటోలో నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను ఆస్పత్రిలో చేర్పించాక వెళ్లి చూసేసరికి ఆటో కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భువనేశ్వరస్వామి ఆలయ కమిటీ ఏర్పాటు

తడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయానికి నూతన కమిటీ ఏర్పాటైంది. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు సమావేశమై నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడుగా తిరుమూరు సుధాకర్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులుగా గుమ్మిడిపూడి ఏడుమలై, చిలమత్తూరు పరంధామయ్య ఆచారితో పాటు మరో నలుగురు సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు దేవస్థానం ఖాతా ద్వారానే విరాళం ఇవ్వాలని కోరారు.

రజక సంఘ కమిటీ ఎంపిక

ఓజిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల ఇనుగుంటలో ఆదివారం రజక సంఘం నూతన కమిటీని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షురాలిగా ఇందిరమ్మ, అధ్యక్షురాలిగా పాలేటి మంజులమ్మ, ఉపాధ్యక్షుడుగా డి.శ్రీనివాసులు, సహకార్యదర్శిగా లక్ష్మి, కోశాధికారిగా తూపిలి శ్యామలమ్మను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రజక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కళత్తూరు రమణయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి అక్కరపాక సుబ్బయ్య పాల్గొన్నారు.




నాయుడుపేట - రేణిగుంట 6లేన్ జాతీయ రహదారి - నాయుడుపేట సమీపంలో లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు (ఫైల్‌ఫొటో)

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేదెలా?

6 లేన్ రహదారిలోనూ యాక్సిడెంట్లు ● సూచిక బోర్డులు లేక, అతివేగంతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిలో ప్రమాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల, తిరుపతికి ఈ రహదారి నుంచి వందలాది వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటూ పదుల సంఖ్యలో మృత్యువాత పడుతుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 6లేన్ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు 58 కిలోమీటర్ల 6లేన్ జాతీయ రహదారిని రూ.2.238 కోట్ల వ్యయంతో నిర్మించారు. అయినా రోడ్డు ప్రమాదాలు ఆగడంలేదు. ఇటీవల నాయుడుపేట పట్టణానికి చెందిన ఓ కుటుంబం దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తూ మరో వాహనానికి ఢీకొనడంతో మహిళ మృతి చెందింది. బెంగళూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మోటారు సైకిల్‌పై వెళ్తుండగా నాయుడుపేట సమీపంలో రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. నాయుడుపేట - పెళ్లకూరు రహదారి సమీపంలో రోడ్డు దాటుతుండగా మోటారు సైకిలిస్టులు, పాదాచారులు రోడ్డు ప్రమాదాలకు గురై అనేక మంది మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. నాయుడుపేట - విన్నమాల సమీపంలో తిరుపతి నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న ఇనుప స్థంభాన్ని ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై అవసరమైన ప్రాంతాల్లో సూచిక బోర్డులు లేకపోవడం, అతి వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గురువులను గౌరవించడం అందరి బాధ్యత



సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో గురువులను గౌరవించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడంతో పాటు వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. నిత్యం పనిఒత్తిడితో ఉండే ఉపాధ్యాయులకు ఆట విడుపుగా ఉండేలా క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు ఉత్తమ బోధనను అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థను పటిష్ఠపరిచేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, ఆరికట్ల మస్తాన్ నాయుడు, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, కరిముల్లా, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద జనసేన నాయకులు ఆవుల రమణ, మాబాషా ఆధ్వర్యంలో నేవా బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, నాగేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, టీడీపీ నాయకుడు మాధవనాయుడు చేతుల మీదుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 52 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు హరిబాబు, కోటి, రాము, సురేష్, తేజ, సూర్య, పద్మజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ రమేష్, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఆదినాయణ రెడ్డి తదదితరులు

సీఐటీయూ మండల కమిటీ ఏకగ్రీవం

నాయుడుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండల సీఐటీయూ నూతన కమిటీని ఆ సంఘ జిల్లా కార్యదర్శి లక్ష్మి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంఘం మహేష్, ప్రధాన కార్యదర్శిగా శివకవి ముకుంద, సహకార్యదర్శిగా ఎస్.శ్యామల, ఉపాధ్యక్షులుగా సుజాత, కాలేషా, కోశాధికారిగా విజయమ్మ, సభ్యులుగా మస్తాన్‌రెడ్డి, సతీష్, పెంచులమ్మ, నాదముని, వానమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నాయుడుపేట సీఐటీయూ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు.

వెంకయ్యనాయుడు పర్యటనకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ సంఘమేశ్వరావు, ఎస్ఐ నాగరాజు

పెళ్లకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరులోని చాగణం లలితమ్మ - భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టును సోమవారం మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం డీఎస్పీ చెంచుబాబు, నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరావు, ఎస్ఐ నాగరాజుతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం ట్రస్టులో లలితమ్మ విద్యా వికాస ఉపకార వేతనాల పంపిణీ, డీ-అడిక్షన్ సెంటర్, వ్యాయామశాల, పార్కు ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ పాల్గొంటారని ట్రస్ట్ సీఈవో పెనుబల్లి సీతారామయ్య తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా: పది మందికి గాయాలు

వాకాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురం గ్రామస్తులు వినాయక విగ్రహాన్ని తూపిలిపాళెం సముద్రతీరానికి తీసుకువెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో పది మందికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.... కాశీపురం నుంచి 25 మంది గణేష్ విగ్రహంతో నిమజ్జనానికి బయలుదేరారు. వాకాడు గిరిజన కాలనీ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాకొట్టడంతో పది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.





తడ మండల పరిధిలోని వేనాడులో వెలసిన షేక్ దావూద్ షా వలీల్లాహ్ అల్లాతాత దర్గా గంధోత్సవం ఆదివారం ముగిసింది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సోదరి రెహానా బేగం, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకులు బొమ్మన్ పళణి, శెల్వం, బొమ్మన్ శ్రీధర్ దర్గాను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ అన్నపూర్ణ, గ్రామస్తులు శ్రీరాం, సదానందం,వెంకటాద్రి, భాస్కర్, మాజీ సర్పంచ్ శ్రీదేవి పాల్గొన్నారు.

వృద్ధుడిపై కత్తితో దాడి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అప్పుతీసుకున్న నగదు అడిగినందుకు కత్తితో దాడిచేసిన ఘటన నాయుడుపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.... పట్టణానికి చెందిన నరసయ్య, అతని స్నేహితుడు సురేంద్రరెడ్డి ఆదివారం రాత్రి మద్యం తాగారు. ఆ సమయంలో నరసయ్య తనకు ఇవ్వాల్సిన రూ.160 నగదు గురించి సురేంద్రరెడ్డిని అడిగాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సురేంద్రరెడ్డి కత్తితో నరసయ్యపై దాడి చేశాడు. గాయపడిన నరసయ్యను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.




గూడూరు, సూళ్లూరుపేటలో నిమజ్జనానికి తరులుతున్న వినాయక ప్రతిమలు

నిమజ్జనానికి గణనాథులు

సూళ్లూరుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో వినాయక చవితి సందర్భంగా కొలువుదీర్చిన గణనాథులను ఆదివారం ఐదోరోజు నిమజ్జనానికి తరలించారు. గాండ్లవీధి, గణపతి నగర్, ఆఫ్గన్ వీధి, ఝాన్సీనగర్ తదితర ప్రాంతాల్లో కొలువుదీర్చిన గణనాధుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం అనంతరం నిమజ్జనా నికి తరలించారు. పలుచోట్ల అన్నదానం చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తడ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గణేశ్ నిమజ్జనం వేడుకగా జరిగింది. వినాయక చవితి నాడు ప్రతిష్ఠించిన విగ్రహాలకు ఐదు రోజులపాటు పూజలు చేశారు. ఆదివారం వాకాడు మండలం తూపిలి పాళెం బీచ్‌కు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

నాయుడుపేట టౌన్: వినాయక చవితి నాడు ప్రతిష్ఠించిన విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. నాయుడుపేట పట్టణం, మండలంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దాదాపు గరిష్ఠంగా అన్ని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

గూడూరు: పట్టణంలోని పలు కూడళ్లలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతిమలను ఆదివారం నిమజ్జనానికి తర లించారు. ముందుగా వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించారు. వాహనాలపై ఉంచి గ్రామోత్సవాలు జరిపారు. బాణసంచా పేలుళ్లు, తీన్‌మార్ బ్యాండు మేళాలు, యువత చిందుల నడుమ గ్రామోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక జాతీయ రహదారి సమీపంలోని పంబలేరు, వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రతీర ప్రాంతాల్లో నిమజ్జనం చేసేందుకు వినాయక విగ్రహాలను తీసుకెళ్లారు.

బాలాయపల్లి: మండల పరిధిలోని మన్నూరు, జయంపు రజక వీధి, గొట్టికాడు గ్రామాల్లో వినాయకులను ఆదివారం నిమజ్జనం చేశారు.



బాలాయపల్లి మండలం జయంపులో వినాయకుడి ఊరేగింపు